క్లుప్తంగా

జెడ్పీ పాఠశాలకు క్రీడా సామగ్రి వితరణ

మూలపాడు(ఇబ్రహీంపట్నం): గొల్లపూడికి చెందిన ప్రముఖ యోగా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మూలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.10వేల విలువ కలిగిన క్రీడా సామగ్రిని అందజేశారు. యోగా గురువు శరత్, సంస్థ సభ్యులు కృష్ణారావు, ఆలీ, లక్ష్మీ వీటిని జెడ్పీ పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు చావా సతీష్, వ్యాయామ ఉపాధ్యాయులు తోట సురేంద్ర బాబు, చెరుకూరి శ్రీనివాసరావు, వహీదాబేగంలకు అప్పగించారు. వీటితో పాటు పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన వాలీబాల్ కోర్టుకు అవసరమైన క్రీడా పరికరాలు కూడా సమకూరుస్తామని హామీ ఇచ్చారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

తిరువూరు: స్థానిక పాటిమీద దాసాంజనేయ స్వామి దేవస్థాన పునర్నిర్మాణ పనులకు రిటైర్డు ఉపాధ్యాయుడు సముద్రాల కృష్ణమూర్తి సోమవారం రూ.10,116 విరాళాన్ని అందజేశారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వెల్లంకి సురేంద్రబాబు, ఆలయ ట్రస్టు సభ్యులు కొల్లిపర సుబ్బారావు, చెలికాని ప్రదీప్‌లకు ఈ విరాళాన్ని అందించారు. తిరువూరుకు చెందిన వ్యాపారి చిత్తలూరి విశ్వేశ్వరరావు రూ.5,116, సాయిరి వెంకటరమణ, సాంబశివరావు రూ.11,001, గొండేల కాంతారావు, త్రివేణి రూ.10,116, నాళా ఖాదర్‌బాబు రూ.21,116 విరాళాన్ని అందజేశారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని నిరసన

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): హెచ్‌పీసీఎల్ ఆయిల్ టెర్మినల్‌లో ఇటీవల కాలంలో తొలగించిన కార్మికుడు శంకర్‌ను, ఇటీవల మృతి చెందిన కార్మికుడు వెంకటేశ్వరరావు కుమారుడు జీవన్‌కు ఉపాధి అవకాశం కల్పించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం నిరసన చేపట్టారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి మహేష్, హెచ్‌పీసీఎల్ ఆయిల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ 20 ఏళ్లుగా సంస్థ పురోభివృద్ధికి కృషి చేసిన కార్మికులను తొలగించడం, మృతి చెందిన వారి కుటుంబాలకు ఉపాధి కల్పించకపోవడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. సమానపనికి సమానవేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనియన్ అధ్యక్షుడు శేఖర్, పిచ్చయ్య, జయరాజు, కార్మికులు పాల్గొన్నారు

సమస్యల పరిష్కారానికి శ్రద్ధ చూపాలి



తిరువూరురూరల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు శ్రద్ధ చూపాలని తిరువూరు మండల పరిషత్ అధ్యక్షురాలు గద్దల భారతి కోరారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు గత సమావేశాల్లో తెలిపిన సమస్యలు పరిష్కారం కాకపోవడంతో పదే పదే ప్రస్తావిస్తున్నారన్నారు. ప్రభుత్వం మంజూరు చేసే నిధులతో ప్రాధాన్యతా క్రమంలో సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ కోరారు. పలు శాఖల ద్వారా గ్రామాల్లో జరుగుతున్న పనులపై సమావేశంలో చర్చించారు. ఎంపీడీవో రవిబాబు, అధికారులు పాల్గొన్నారు.

పదో తరగతి స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

తిరువూరు: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రూపొందించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల స్టడీ మెటీరియల్‌ను శాసనమండలి సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు ఆవిష్కరించారు. స్థానిక సత్యా బీఈడీ కళాశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యూటీఎఫ్ తిరువూరు శాఖ ప్రతినిధులు నాగేశ్వరరావు, భరతకుమారి, తోట ఉమామహేశ్వరరావు, ఎంఈవో శ్యాంసుందర్, తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

పదో తరగతి ఎస్ఏ-1 గణితం పరీక్ష వాయిదా

నూజివీడు: ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూళ్లలో సోమవారం నిర్వహించాల్సిన పదో తరగతి సమ్మెటివ్ అసెస్‌మెంట్-1(ఎస్ఏ-1) గణితం పరీక్ష వాయిదా పడింది. దీనికి సంబంధించిన ప్రశ్నపత్రం యూట్యూబ్‌లో లీక్ కావడంతో ప్రశ్నపత్రాలను పాఠశాలకు పంపకముందే ప్రభుత్వం రద్దు చేసింది. మరలా పరీక్షను ఎప్పుడు నిర్వహించేదీ ప్రభుత్వం త్వరలోనే ప్రకటిస్తుందని డీవైఈఓ ఎం.సేవియా తెలిపారు.

ముగిసిన సప్తాహం

గంపలగూడెం: మేడూరు శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న హరేరామ నామ సప్తాహ మహోత్సవం సోమవారం ముగిసింది. ఆలయ ప్రధానార్చకులు కోమండూరి ఆంజనేయాచార్యులు ఆధ్వర్యంలో గణపతి పూజ అనంతరం పూర్ణాహుతి నిర్వహించి సప్తాహ మహోత్సవం ముగించారు. సువర్చలాదేవి కల్యాణంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. పలువురు దీక్షాపరులు ఇరుముడులతో స్వామివారి గిరి ప్రదక్షిణ చేసిన అనంతరం దీక్షలు విరమించారు. ముగింపు సందర్భంగా జరిగిన అన్నదానంలో భక్తులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- ప్రమాదభరితంగా వంతెనలు, చప్టాలు
- భయాందోళనలో ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



చంద్రాల వద్ద సాగర్ కాలువపై కట్టిన వంతెనకు ధ్వంసం అయిన సైడ్‌వాల్స్



గుర్రాజుపాలెం వెళ్లే ప్రధాన రహదారిలో ప్రమాదకరంగా వంతెన

మైలవరం: మైలవరం నియోజకవర్గంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారుల్లో ఉన్న వాగులపై వంతెనలు ప్రమాదభరితంగా ఉన్నాయి. మైలవరం నియోజకవర్గంలోని మైలవరం మండలం పుల్లూరు, చిలుకూరువారిగూడెం గ్రామాల మధ్య బుడమేరు వాగుపై ఏర్పాటుచేసిన లో లెవెల్ వంతెన కుంగిపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రెండు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మూడు దశాబ్దాల క్రితం బుడమేరు వాగుపై నిర్మించిన ఈ లో లెవెల్ వంతెనపై రెండు గ్రామాలకు చెందిన రైతులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారు రాకపోకలు సాగిస్తుంటారు. ఉమ్మడి కృష్ణాజిల్లా, గుంటూరు జిల్లాలకు చెందిన పలువురు భక్తులు ఈ వంతెన మీదుగా జమలాపురంలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయానికి మొక్కులు తీర్చుకోవడానికి వెళుతుంటారు. ఈ లో లెవెల్ వంతెనపై ప్రజలు, వివిధ రకాల వాహనాలు నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఇటీవల కురిసిన వర్షాల ప్రభావంతో వాగు ప్రవాహానికి కొంతమేర వంతెన విరిగిపోయింది. దీనితో వంతెనకు ఇరువైపులా రాకపోకలు సాగించకుండా అడ్డు గోడలు కట్టారు. పుల్లూరు శివారు చిలుకూరువారిగూడెం గ్రామస్తులు పక్క గ్రామాలకు వెళ్లాలంటే పుల్లూరు గ్రామం నుంచి వెళ్లాల్సి వస్తుంది. దీనితో కనీసంగా అర కిలోమీటర్ దూరం పెరగడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదమని తెలిసినా గ్రామస్తులు వంతెనపై నిర్మించిన అడ్డుగోడలు తొలగించి రాకపోకలు సాగిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వంతెన మధ్యలో కొంత భాగం కుంగి మధ్యలో భారీ గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. దీనితో వాహన చోదకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతూ ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని ఈ వంతెనపై ప్రయాణం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ వంతెనపై ప్రయాణం సాహసంతో కూడినదిగా మారింది. మండలంలోని చంద్రాల గ్రామం శివారు సాగర్ కాలువపై నిర్మించిన వంతెన సైడ్ వాల్స్ వాహనాలు ఢీకొనడంతో అక్కడక్కడ ధ్వంసమయ్యాయి. మైలవరం-నూజివీడు ఆర్ అండ్ బీ రహదారి కావడంతో నిత్యం బస్‌లు, లారీలు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ నేపథ్యంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జి.కొండూరు మండలం గుర్రాజుపాలెం వెళ్లే రహదారిలోని వాగుపై చప్టాకు రెండు పక్కల రైలింగ్స్ లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. వాగు ఉధృతం



చిలుకూరువారిగూడెంలో ప్రమాద భరితంగా ఉన్న వాగుపై వంతెన

వచ్చినపుడు వంతెనపై నుంచి వరదనీరు ప్రవహిస్తుంటుంది. గుర్రాజుపాలెం గ్రామంలో పండించిన కూరగాయల పంటలను రైతులు మైలవరంలోని రైతు బజారుకు తరలించి అమ్ముకుంటూ ఉంటారు. కూరగాయల వ్యాపారస్తులు రాత్రి షాపులు మూసిన తరువాత ఇళ్లకు వెళుతూ ఉంటారు. గతంలో వాగు పొంగి ఇద్దరు బాలురు ఈ వాగులో పడి కొట్టుకుపోయారు. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తనను గెలిపిస్తే నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఇప్పటి వరకు ఈ సమస్యపై స్పందించకపోవడం గమనార్హం.

తక్షణం వంతెన పునర్నిర్మించాలి



మైలవరం నుంచి పుల్లూరు వెళ్లే రహదారిలోని వంతెన ఒక పక్కన కుంగిపోయి ప్రమాద భరితంగా మారింది. ముఖ్యంగా వర్షాకాలంలో వంతెన దాటాలంటే వాగు ఉధృతికి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. ఈ రహదారి నుంచే జమలాపురం శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానానికి వెళ్లాల్సి ఉంది. వెంటనే వంతెన పునర్నిర్మించాలి.

–చిలుకూరి కృష్ణారెడ్డి, చిలుకూరివారిగూడెం

ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన ట్రైనీ కలెక్టర్



ట్రైనీ కలెక్టర్ శుభం నొఖ్వాల్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలుపుతున్న అధికారులు

జి.కొండూరు: కలెక్టర్‌గా శిక్షణలో ఉన్న శుభం నొఖ్వాల్ నెల రోజులపాటు జి.కొండూరు ఎంపీడీవోగా విధులు నిర్వహించేందుకు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ బసవలింగేశ్వరరావు, ఎంఈఓ పీవీ నరసింహారావు, డెప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, కార్యాలయం సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రీవెన్స్‌లో పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు.

హైందవ శంఖారావం విజయవంతం చేయండి

కిలేశపురం(ఇబ్రహీంపట్నం): ఆంధ్రప్రదేశ్ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వచ్చే ఏడాది జనవరి 5న విజయవాడలో జరగనున్న హైందవ శంఖారావం మహాసభ విజయవంతం చేయాలని ఆర్ఎస్ఎస్ సంక్షమ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏవీఎస్ మూర్తి, ఆర్ఎస్ఎస్ గ్రామీణ వికాస్ సంయోజక్ చెవుల గోపాలరావు కోరారు. కిలేశపురం గంగానమ్మ ఆలయ కమిటీ సభ్యులతో కలిసి సోమవారం వారు కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కృష్ణారావు, బాణావత్ బాలాజీ, మువ్వ సాయిబాబు, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంధన వనరులను భావితరాలకు అందించాలి

విద్యుత్ శాఖ ఈఈ వసంతరావు



ఇంధన పొదుపుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది

ఇబ్రహీంపట్నం: ఇంధన వనరులు భవిష్యత్ తరాలకు అందించే బాధ్యత మనందరిపై ఉందని రూరల్ డివిజన్ విద్యుత్ శాఖ ఈఈ వసంతరావు తెలిపారు. ఇబ్రహీంపట్నంలో విజయవాడ రూరల్ డివిజన్ విద్యుత్ శాఖ సిబ్బంది ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా సోమవారం విద్యుత్ పొదుపుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ వరకు చేరింది. ఈ సందర్భంగా ఈఈ వసంతరావు మాట్లాడుతూ మూడు నుంచి ఐదు నక్షత్రాలు కలిగిన విద్యుత్ ఉపకరణాలు ఇళ్లల్లో వినియోగించాలన్నారు. ఇష్టానుసారంగా విద్యుత్ వాడకం వలన భవిష్యత్ తరాలకు ఇబ్బంది కలుగుతుందని తెలిపారు. ఇంధన పొదుపు చిట్కాలతో కరపత్రాలు పంపిణీ చేశారు. వివిధ డివిజన్‌ల డీఈఈలు కేవై కొండలరావు, జె.శ్రీనివాస్, సుధాకర్, ఏఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

మేలైన సాగు పద్ధతులపై అవగాహన కల్పించండి



జి.కొండూరు: మేలైన సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించినప్పుడే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులను సాధించగలుగుతారని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ మాధవీలత అన్నారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో రబీ సాగుపై విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించిన మాధవీలత మాట్లాడుతూ రబీ సాగులో వరి, మొక్కజొన్న, శనగలు, మినుము వంటి పంటల సాగు పద్ధతులు, సస్యరక్షణ చర్యలు, ఈ-క్రాప్ విధానం, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన వంటి అంశాలపై వీఏఏలకు శిక్షణ ఇచ్చారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

చాట్రాయి: మండలంలోని చిత్తపూరు జై భీమ్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 120 మంది వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరువీధి రమేష్, మాజీ సర్పంచ్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

సూరంపాలెంలో...

చాట్రాయి: సూరంపాలెం గ్రామంలో న్యూలైఫ్ ఇండియా మిషన్స్ వ్యవస్థాపకులు అపొస్తులు ఘంటా రత్నరాజు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి ప్రార్థనలు జరిపారు. అనంతరం 120 మంది చర్చి పాస్టర్లు, 60 మంది మహిళలు, 10 మంది వృద్ధులు, ఆరుగురు అనాథ పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు.

క్రీడాకారులకు దుస్తుల వితరణ

మల్లేల(తిరువూరురూరల్): మండలంలోని మల్లేల జెడ్పీ ఉన్నత పాఠశాలలో కబడ్డీ క్రీడాకారులకు ఆ పాఠశాల వ్యాయామోపాధ్యాయుడు కృష్ణప్రసాద్ నాయక్ క్రీడా దుస్తులు వితరణ ఇచ్చారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రూ.8వేల విలువైన క్రీడా దుస్తులను కబడ్డీ క్రీడాకారులకు ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్ చేతుల మీదుగా అందించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ విరాళం అందజేసినట్లు కృష్ణప్రసాద్ తెలిపారు.

మీ కోసంనకు స్పందన కరువు



నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మీకోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఆర్డీఓ వాణి

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం)కు ప్రజల నుంచి స్పందన కరువైంది. నూజివీడులోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసంలో కేవలం 9 అర్జీలు మాత్రమే అందాయి. ఈ రెవెన్యూ డివిజన్‌లో ఆరు మండలాలు ఉండగా కేవలం తొమ్మిది అర్జీలు మాత్రమే రావడం, అది కూడా రెవెన్యూకు సంబంధించినవే ఉండటం గమనార్హం. గ్రామాల్లో అడుగడుగునా సమస్యలు ఉన్నప్పటికీ అర్జీలు ఇచ్చినా పరిష్కారం శూన్యమనే భావనలో ప్రజలు ఉన్నారు. దీంతో అర్జీలు ఇచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. దీనికి తోడు పలు శాఖల అధికారులు సైతం మీకోసంకు గైర్హాజరవుతుండడం కూడా కారణంగా తెలుస్తోంది. సోమవారం నాటి కార్యక్రమంలో ఇరిగేషన్, బీసీ వెల్ఫేర్, మున్సిపాలిటీ, ఆర్ అండ్‌బీ, పోలీస్, ఆర్టీసీ, ఎక్సైజ్ శాఖల నుంచి ఎవరూ హాజరుకాలేదు. కేవలం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చిలుకూరు భాస్కరరెడ్డి, డీఎల్‌పీఓ ఎంపీఎస్ సుందరి, సీడీపీఓ ఎస్వై నూరానీ, కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి.నాగలక్ష్మి, ఏడీఏ జి.విద్యాసాగర్, హెచ్ఓ ఆర్.హేమ తదితరులు పాల్గొన్నారు.

అర్జీల్లో ముఖ్యమైనవి ఇలా ఉన్నాయి.

- నూజివీడు మండలం నర్సపేట రెవెన్యూ పరిధిలో ఆర్ఎస్ నంబరు 42-3లో తనకున్న 50 సెంట్ల భూమిలో షెడ్డు నిర్మాణం నిమిత్తం తాను ఉంచిన రూ.50వేల విలువైన రేకులు, ఇనుప పైపులు తదితర నిర్మాణ సామగ్రిని ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం శివారు వెంపటిగూడెంకు చెందిన వెంపటి యోనా అనే వ్యక్తి దౌర్జన్యంగా దొంగిలించాడని, దీనిపై ప్రశ్నిస్తే చంపుతానని బెదిరిస్తున్నాడని, విచారణ జరిపించి న్యాయం చేయాలని ఆగిరిపల్లికి చెందిన తాళ్లూరి వెంకటరత్నం అర్జీని అందజేశారు.
- తనకు నూజివీడు పట్టణంలోని రామన్నగూడెం రోడ్డులోని జగనన్న కాలనీలో ఇళ్ల స్థలం ఇచ్చారని, అయితే నేటికీ దానిని చూపకుండా రెవెన్యూ సిబ్బంది తాత్సారం చేస్తున్నారని, ఇప్పటికైనా తనకు ఇళ్ల స్థలాన్ని చూపి న్యాయం చేయాలని పట్టణంలోని బాపూనగర్‌కు చెందిన వై.సుబ్బలక్ష్మి అర్జీని అందజేశారు.

సంక్షిప్తంగా...

• ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నైపుణ్య శిక్షణ కేంద్రం

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నైపుణ్య శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ళ రవి సోమవారం తెలిపారు. మైలవరం పరిసర ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈ కేంద్రం నిర్వహిస్తోందని, ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ ఆపైన అర్హత కలిగిన అభ్యర్థులకు ప్రత్యేకంగా మూడు నెలలు డొమెస్టిక్ బయోమెట్రిక్ డాటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణకు అర్హులన్నారు. కోర్సుకు ఎంపికైన విద్యార్థులకు డేటా ఎంట్రీ కోర్సులలో ప్రత్యేక శిక్షణ సౌకర్యం కల్పిస్తామని, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. శిక్షణ అనంతరం ప్రముఖ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. ఆసక్తి కలిగి, అర్హత గల నిరుద్యోగ యువత తమ పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా తెలిపారు. కోర్సు పూర్తి చేసిన వారికి ధ్రువపత్రాలు అందజేస్తామన్నారు. ఇతర వివరాలకు కళాశాల కార్యాలయంలో సెల్ నంబర్ 82477 66718 ను సంప్రదించాల్సిందిగా సూచించారు.

• నైపుణ్య శిక్షణపై అధ్యాపకులకు అవగాహన

మైలవరం: అధ్యాపకులు నైపుణ్య శిక్షణపై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సెర్ప్-ఎస్ఎస్ఆర్ రీసెర్చ్ సౌకర్యంపై శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. వివిధ విభాగాల అధ్యాపకులకు ఓమ్ని కాంట్ ప్రయోగాత్మక సెటప్‌ను ఎలా వాడాలి అనే అంశంపై ప్రాజెక్టు పరిశోధకుడు డాక్టర్ బి.రాంబాబు వివరించారు. ప్రాజెక్టు గురువు డాక్టర్ జి.సత్యనారాయణ ఓమ్ని కాంట్ ప్రయోగాత్మక సెటప్ గురించి వివరించారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ జి.శ్రీనివాసులు, వివిధ విభాగాలకు చెందిన ప్రొఫెసర్‌లు హాజరయ్యారు.

• నేటి నుంచి ఎల్ఎస్‌డీఎస్ శిక్షణ సదస్సులు

ఇబ్రహీంపట్నం: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎల్ఎస్‌డీఎస్(లోకలైజేషన్ సస్టెనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్)పై మండల స్థాయి శిక్షణ సదస్సులు మంగళ, బుధవారాల్లో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సునీతశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల సర్పంచులు, వివిధ ప్రభుత్వ శాఖల అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, పశుసంవర్ధక శాఖ వైద్యులు, వ్యవసాయ శాఖ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్ 1 నుంచి గ్రేడ్ 6 వరకు, సచివాలయాల సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

• రెవెన్యూ సదస్సుల్లో 56 ఫిర్యాదులు

గంపలగూడెం: మండలంలోని పెనుగొలనులో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూసంబంధ సమస్యల పరిష్కారం కోరుతూ 56 దరఖాస్తులు వచ్చినట్లు ఆర్ఐ వీరభద్రం తెలిపారు. మండల సర్వేయర్ సాంబశివరావు, వీఆర్వో శ్రీధర్ పాల్గొన్నారు.

• డయాలసిస్ కేంద్ర అభివృద్ధికి చేయూత



తిరువూరు: తిరువూరు కమ్యూనిటీ ఆసుపత్రిలో లయన్స్ క్లబ్ సహకారంతో నిర్వహిస్తున్న డయాలసిస్ కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫండింగ్ గ్లోబల్ గ్రాంట్స్ విభాగ స్పెషలిస్ట్ లయన్ తాషా హెడెన్ రిచ్ తెలిపారు. తిరువూరు కమ్యూనిటీ ఆసుపత్రిలోని డయాలసిస్ సెంటరును సోమవారం ఆమె సందర్శించారు. రోగుల సంఖ్య కనుగుణంగా డయాలసిస్ కేంద్రంలో సదుపాయాలు కల్పించాలని, ఇందుకు క్లబ్ నుంచి సహకారం అవసరమని తిరువూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పసుమర్తి వెంకటేశ్వరరావు కోరారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో డయాలసిస్ సెంటరుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామని హెడెన్ రిచ్ తెలిపారు. ఎల్‌సీఐఎఫ్ ఏరియా లీడర్ లయన్ సుధాకరరెడ్డి, మల్టిపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ శ్రీశాంతి, గవర్నర్ గద్దె శేషగిరి, వైస్ గవర్నర్ ఆంజనేయులు, పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్స్ ఉపేంద్ర, నివృతరావు, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• 21న మండల పరిషత్ సమావేశం

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ పాలడుగు జోత్స్న అధ్యక్షతన ఈనెల 21వ తేదీ మధ్యాహ్నం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సునీత శర్మ తెలిపారు. సమావేశంలో వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, శాశ్వత ఆహ్వానితులు, అధికారులు హాజరు కావాలన్నారు. వివిధ శాఖల అధికారులు ఆయా గ్రామాల్లో ప్రగతి నివేదికలు రెండు రోజుల ముందు కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

• నేటి నుంచి అధికారులు, సర్పంచ్‌లకు శిక్షణ

మైలవరం: మైలవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులకు మంగళవారం, బుధవారం రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ కార్యాలయం తెలిపింది. మైలవరం-2025-26 లోకలైజేషన్ ఆఫ్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ అనే అంశంపై శిక్షణ జరుగుతుందన్నారు.

• ధనుర్మాస ప్రత్యేక పూజలు ప్రారంభం

ముసునూరు: మండలంలోని పలు వైష్ణవాలయాల్లో సోమవారం ధనుర్మాస ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. ముసునూరులోని ప్రసిద్ధ వెంకటాచల స్వామి దేవస్థానం, లోపూడిలోని కోదండ రామాలయం, గోపవరం నాగేంద్రస్వామి దేవస్థానం వద్ద సోమవారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక అష్టోత్తరాలు, పూజాదికాలు నిర్వహించారు.

తిరువూరు: ధనుర్మాసం సందర్భంగా తిరువూరులోని పలు దేవాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. శ్రీవేంకటాచల స్వామి దేవస్థానం, శ్రీకోదండ రామాలయం, శ్రీరంగనాయకస్వామి దేవస్థానం, పాత తిరువూరు రామాలయం, రాజుపేట, చీరాల సెంటర్లలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో తెల్లవారుజామున ఆళ్వార్ల సేవాకాలం, గులాబీపూలతో సహస్ర నామార్చన, విష్ణు సహస్ర నామ పారాయణం తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

సహస్ర దీపాలంకరణ సేవ

తిరువూరు శ్రీవేంకటాచలస్వామి దేవస్థానంలో మార్గశిర పౌర్ణమి సందర్భంగా సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. వైష్ణవ గోష్ఠి భక్తబృంద సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారికి పూజాదికాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు దేవయాజనం వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో సహస్ర దీపాలంకరణ నిర్వహించారు.

పాఠశాల విద్యార్థులకు అన్నదానం

ఇబ్రహీంపట్నం: ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులకు శుభదిన్ భోజన్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల హిందీ ఉపాధ్యాయురాలు కె.మహాలక్ష్మి ప్రత్యేకంగా తయారు చేయించిన మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. మొత్తం 116 మంది విద్యార్థులకు రుచికరమైన భోజనం వడ్డించారు. హిందీ ఉపాధ్యాయురాలి దాతృత్వాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి, ఎస్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

రెవెన్యూ సభలను సద్వినియోగం చేసుకోవాలి

చాట్రాయి: భూ సమస్యల పరిష్కారం నిమిత్తం రెవెన్యూ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ డి.ప్రశాంతి తెలిపారు. పోలవరం గ్రామంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రజలు తమ భూసమస్యలపై అర్జీలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సర్వేయర్ లక్ష్మీనారాయణ, ఫారెస్టు గార్డు దాసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

• త్రివిధ విద్యార్థుల ప్రతిభ

నూజివీడు: పట్టణానికి చెందిన త్రివిధ హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభను కనబరిచినట్లు ప్రిన్సిపాల్ సబ్బినేని శ్రీనివాస్ తెలిపారు. పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవం పురస్కరించుకొని ఏలూరులో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. వక్తృత్వ పోటీల్లో భాను జోషిక ప్రథమ బహుమతి, వ్యాసరచన పోటీల్లో సీహెచ్ సాహితీ ద్వితీయ బహుమతి, క్విజ్‌లో గీతిక మూడో బహుమతి సాధించినట్లు తెలిపారు. వీరికి డీఈఓ ఎం వెంకట లక్ష్మమ్మ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

• అదాలత్‌లో సమస్యలు సత్వర పరిష్కారం



గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): రైల్వే పెన్షనర్స్ అదాలత్‌లో సమస్యలు సత్వరం పరిష్కారం అవుతాయని రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్‌కే చాంద్‌బాషా తెలిపారు. గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపులో కేంద్ర రైల్వే బోర్డు ఆదేశాల మేరకు సోమవారం పెన్షనర్స్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా చాంద్‌బాషా మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలు అధికారులు పరిష్కరించాలని, స్థానిక రైల్వే వైద్యశాలలో ఉద్యోగులకు అవసరమైన వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. పెన్షనర్లు ఆధార్ నంబర్‌కు ఫోన్ నంబర్ అనుసంధానం చేసుకోకపోవడంతో వచ్చే పెన్షన్‌లో ఇన్‌కంట్యాక్స్ కట్ చేస్తున్నారన్నారు. దీనిని నివారించాలని కోరారు. అదాలత్‌లో కొంతమంది పెన్షనర్ల సమస్యలకు పరిష్కారం చూపారు. వర్క్‌షాప్ సీడబ్ల్యూఎం ఎస్.శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

• మహిళా సమైక్య కార్యవర్గం ఎన్నిక

ఆగిరిపల్లి: స్థానిక వెలుగు కార్యాలయంలో మండల మహిళా సమైక్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం రాజశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షురాలిగా గోళ్ళ శాంతకుమారి, ఉపాధ్యక్షురాలిగా సుంకర కరుణకుమారి, కార్యదర్శిగా సయ్యద్ బషీర్, కోశాధికారిగా పామర్తి శివరేవతిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని ఏపీఎం రాజశేఖర్ అభినందించారు. కార్యక్రమంలో స్త్రీ నిధి మేనేజర్ ఎం.గోపి, సీసీలు దివ్య, హుస్సేన్ బి.లక్ష్మి, డ్వాక్రా సభ్యులు పాల్గొన్నారు.

• ఏడుగురిపై బైండోవర్ కేసు నమోదు

ఆగిరిపల్లి: మండలంలో పలు గ్రామాలకు చెందిన సారా విక్రయదారులు, బెల్ట్ షాపు నిర్వాహకులను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. సగ్గుర్తి వెంకటరావు, పల్లగాని ఆంజనేయులు, కొండ్రు సుధాకర్, కూరాకుల మురళీకృష్ణ, అక్కిరెడ్డి గోపిరాజు, యామర్తి వెంకటనారాయణ, సింహాద్రి పద్మావతిలను సోమవారం తహసీల్దార్ కార్యాలయంలోని డెప్యూటీ తహసీల్దార్ పవన్ కుమార్ ఎదుట బైండోవర్ చేసినట్లు చెప్పారు. మళ్లీ నేరాలకు పాల్పడితే రూ.లక్ష జరిమానా విధించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు రద్దు చేస్తామని డీటీ పవన్ కుమార్ హెచ్చరించారు.

• తెలంగాణ మద్యం స్వాధీనం

తిరువూరు: తిరువూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం జరిపిన దాడుల్లో తెలంగాణ మద్యం విక్రయిస్తున్న ఇరువురు మహిళలను అరెస్టు చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ ఎంఆర్ శేషయ్య తెలిపిన వివరాల ప్రకారం విస్సన్నపేట మండలం కొండపర్వలో ఎం.బాలమ్మ, ఆకుల ప్రభావతి తెలంగాణ మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 72 తెలంగాణ మద్యం సీసాలను స్వాధీనపరచుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

• 20 లీటర్ల సారా స్వాధీనం

చాట్రాయి: సారా తయారీ కేంద్రాలపై దాడి చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ ఎస్ఐ మస్తానరావు తెలిపారు. మండలంలోని పోలవరం గ్రామంలో సోమవారం సారా తయారీ కేంద్రంపై దాడి చేసి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని, నేరస్తుడు పారిపోవడంతో అతని ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.